క్లుప్తంగా

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

బాలానగర్: మండలంలోని నేరెళ్లపల్లిలో శుక్రవారం నుంచి బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బొడ్రాయి, ధ్వజ స్తంభం, విగ్రహాల స్థాపన 26 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

28న చిత్రలేఖన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: చిత్రకారుడు రాజా రవివర్మ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో స్వరలహరి కల్చరల్ అకాడమి, స్ఫూర్తి సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 28వ తేదీన ఉదయం 9 గంటలకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 4వ తరగతి వరకు అందమైన ప్రకృతి, 5 నుంచి 7 వరకు మొక్కలను పెంచాలి-ప్రకృతిని రక్షించాలి, 8 నుంచి ఇంటర్ వరకు ఓటరుపై రాజకీయ ప్రలోభాలు, మంచి నాయకుడి వల్ల లాభాలు అంశాలపై చిత్రలేఖన పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు తమ డ్రాయింగ్ మెటీరియల్స్‌తో పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాల కోసం 9553811361, 9490205212 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

వేరుశనగ క్వింటా రూ. 6,691

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగ క్వింటా గరిష్టంగా రూ. 6,691, కనిష్టంగా రూ. 5,665 ధర పలికింది. మొక్కజొన్న గరిష్టంగా రూ. 2,271, కనిష్టంగా రూ. 2,162, ఆముదాలు రూ. 5,581, ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ. 2,629, కనిష్టంగా రూ. 2,009, హంసధాన్యం గరిష్టంగా రూ. 2,126, కనిష్టంగా రూ.1,959, రాగులు రూ.3,812 ధరలు వచ్చాయి.

ప్రతిభచాటిన విద్యార్థులకు సన్మానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను డీఐఈఓ శ్రీధర్ సుమన్ గురువారం సన్మానించారు. మహబూబ్‌నగర ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి రిషిక 982 మార్కులు, ఒకేషనల్ కళాశాల జడ్చర్ల విద్యార్థి శ్యాంసుందర్ 980 మార్కులు, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని సోహా 973 మార్కులు, జడ్చర్ల కో ఎడ్యుకేషన్ కళాశాల సానియాబేగం 971, కో ఎడ్యుకేషన్ కళాశాల జడ్చర్ల ఎండీ కిర్మానీ 968, ఒకేషనల్ కో ఎడ్యుకేషన్ కళాశాల జడ్చర్ల సాయిరాం 968లను ఆయన అభినందించారు.

పైరవీకారులకు తావులేదు

జడ్చర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారులకు అవకాశం లేదని డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి గురువారం తెలిపారు. భూ రిజిస్ట్రేషన్‌లకు పైరవీకారులను నమ్మి మోసపోవద్దని అన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో గురువారం బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చన్న యాదవ్, అరవింద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక..



మిడ్జిల్: మండలంలోని లింబ్యాతండాకు చెందిన పలువురు యువకులు గురువారం బాల త్రిపుర సుందరి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువ కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో సికిందర్‌నాయక్, నరేందర్, నాగరాజ్, సంతోష్, ఓంకార్, నాగేందర్, ఉన్నారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి



భూత్పూర్: మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే రోడ్‌షోకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మెట్టుగడ్డ నుంచి గడియారం చౌరస్తా వరకు రోడ్‌షో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

బాలానగర్: జిల్లాకు రానున్న కేసీఆర్‌కు మండల కేంద్రంలో భారీ ఎత్తున పూల వర్షంతో స్వాగతం పలకాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో జరిగే రోడ్ షోలో కేసీఆర్ పాల్గొంటారని అంతకు ముందు మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు స్వాగతం పలుతున్నామని కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నర్సింగ్ కళాశాలపై ఐఎన్‌సీ సంతృప్తి



వివరాలు సేకరిస్తున్న ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు

పాలమూరు: ప్రభుత్వ నర్సింగ్ కళాశాల గుర్తింపు (రిజిస్ట్రేషన్) కోసం మార్చి 28న కళాశాలను సందర్శించాలని పాలమూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి ఐఎన్‌సీకి దరఖాస్తు చేశారు. దాదాపు నెల రోజుల తర్వాత మొదటిసారి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) బృందం కళాశాలను సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సభ్యులు కళాశాలను సందర్శించి తరగతి గదులు, ఆరు ల్యాబ్‌లు, హాస్టల్ గదులను పరిశీలించారు. ఆ తర్వాత జిల్లా జనరల్ ఆస్పత్రిలోని వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ పరిశీలించి వివరాలు సేకరించారు. ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోతీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను పరిశీలించి పలు అంశాలపై వివరాలు సేకరించారు. చివరగా నర్సింగ్ కళాశాలకు సంబంధించి విద్యార్థులు హాజరు, రికార్డులు, సిబ్బంది వివరాలు సేకరించారు. తనిఖీలు పూర్తి చేసిన తర్వాత ప్రస్తుతం ఉన్న నర్సింగ్ భవనం వేరే చోట ఉంటే బాగుండూ అనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నర్సింగ్ కళాశాల, జనరల్ ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సేకరించిన అంశాలపై పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేశారు. సభ్యులు పూర్తిగా సంతృప్తితో వెళ్లారని, త్వరలో గుర్తింపుపై స్పష్టత రానుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. 27న రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు కళాశాలను సందర్శిస్తారని ఆమె వెల్లడించారు.

కేసీఆర్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై నిర్లక్ష్యం
- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేసీఆర్ పాలమూరుకు వచ్చి ఓట్లు అడిగే హక్కు లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడుతున్నారని కేసీఆర్‌ను పాలమూరు ఎంపీగా నిలబెట్టి గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక అదనంగా ఒక్క ప్రయోజనకరమైన పని చేయలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2014 జూన్ 11న శంకుస్థాపన చేసి మూడేళ్లలో ప్రారంభిస్తామని చెప్పి నిర్లక్ష్యం వహించారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కంటే 11 నెలల తర్వాత శంకుస్థాపన చేసిన కాళేశ్వరాన్ని ప్రారంభించి ఇప్పటి ఐదేళ్లు అయిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీళ్లు వదుతున్నానని చెప్పి డ్రామాలు చేశారని ఆరోపించారు. నారాయణపేట జిల్లాకు సైనిక్‌స్కూల్, గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఒక ఆహార కేంద్రాన్ని తీసుకొస్తే నిలుపుకోలేదన్నారు. కోయిల్‌సాగర్ ఆయకట్టు పెంచుతామని చెప్పి ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదన్నారు. సంగబండకు సంబంధించి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌ను అసలే పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ జిల్లా ప్రజలను సెంటిమెంట్‌తో ఓట్లు వేయించుకోవడానికి ఉపయోగించుకున్నారే తప్పా చేసిందేమిలేదని ఆరోపించారు. సమావేశంలో సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, రాములు యాదవ్, బాలస్వామి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన 'అక్షర'



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అక్షర కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. బైపీసీ విభాగంలో అయేషాఇస్రా సిద్ధిఖి 437, భార్గవి 436, లక్ష్మీప్రియ 436, సానియా ఆఫ్రెన్ 436, ఎంపీసీ విభాగంలో అఖిల్‌గౌడ్ 462, కృతిశ్రీ 460, కౌశిక 457, బి.వర్షిత 457 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో సుహారీత్ భరద్వజ 988, శిరీష 976, గాయత్రి నేహా తబస్సుం 973, త్రిపుర 967, రేష్మిత 946 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఆమెన తబస్సుం 974, ఆసియా తబస్సుం 960, ఆస్మసిద్ధికి 953 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఫణిప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



సీసీకుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని 1వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ మహిమూద్, జిజిపాల్, టీచర్ గోపాల్, గంజి బాల్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, ప్రతాప్, రహిమత్ పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేపట్టి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జగదీశ్వర్, లక్ష్మీనారాయణ, బాలరాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ప్రదీప్‌కుమార్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి రాకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర నుంచి టికెట్ ఆశించానని, రాకపోవడంతో కొంత బాధపడి పార్టీకి దూరమైనట్లు తెలిపారు. టీపీసీసీ పిలుపుమేరకు మళ్లీ పార్టీలో చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

జడ్చర్ల: మండలంలోని జడ్చర్ల-గొల్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలులోనుంచి కిందపడి కర్నూలుకు చెందిన సాయిప్రసన్న (18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలియజేశారు. గురువారం ఉదయం 9:30 గంటలకు రైలుపట్టాలపై ఒక వ్యక్తి చనిపోయాడని సమాచారం రాగా సందర్శించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో మృతుడు కర్నూలుకు చెందిన సాయిప్రసన్నగా తేలిందన్నారు. ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడని, హైదరాబాద్ నుంచి కర్నూలు బయలుదేరాడని తెలిసిందన్నారు. అయితే రైలు నుంచి జారిపడిపోయి బలమైన రక్త గాయాలతో చనిపోయినట్లు చెప్పారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

పీయూ ప్రతిష్టను కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ టీచర్స్ అసోసియేషన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధ్య జరుగుతున్న గొడవలపై వెంటనే వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ స్పందించి చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వీసీకి గురువారం వినతి పత్రం అందజేశారు. అధ్యాపకుల గొడవల వల్ల యూనివర్సిటీ ప్రతిష్ట దిగజారుస్తున్నారని, విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులను కులాల వారీగా విడదీసి వారి స్వార్థం కోసం పెడదోవ పట్టిస్తున్నారన్నారు. యూనివర్సిటీతో సంబంధం లేని వ్యక్తులు ఇష్టానుసారంగా లోపలికి తీసుకువస్తున్నారని, పైరవీలకు ఫార్మసీ కళాశాల అడ్డాగా మారిందన్నారు. బయటి వ్యక్తులు ఇక్కడ తిరగడం వల్ల ఉద్యోగులు భయభ్రాంతులకు గురవుతున్నారని, వారిని యూనివర్సిటీలోకి అనుమతించవద్దన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాము, గణేష్, సురేందర్, భరత్ బాబు, వంశీ, నరసింహ, రవితేజ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యానికి కారణమైన వ్యక్తికి జరిమానా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులో గురువారం పాత కేబుల్‌ను కాల్చి రాగి వైర్లను తీసిన ఖాజాకు మున్సిపల్ అధికారులు రూ.4వేల జరిమానా విధించారు. అనంతరం రాగి వైర్లను స్వాధీనపరుచుకున్నారు. వీటి ద్వారా గాలి కాలుష్యంతో పాటు పొగకు కారణమైనందున స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం తెలిపారు.

నగదు పట్టివేత

బాలానగర్: మండల కేంద్రంలో గురువారం నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ త్రిపాజీ తెలిపారు. గురువారం తనిఖీలు చేస్తుండగా కర్నూల్ చెదిన షేక్ నూర్ అహ్మద్‌తో రూ.56వేల నగదు లభించింది. శ్రీరంగాపూర్ చెందిన అంజనేయులుతో రూ.58 వేల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి



భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నవాబుపేట: దోమలతో జనం అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించారు. మలేరియా దోమల లక్షణాలు అవి పెరిగే ప్రదేశాలపై అందరూ అవగాహన పొందాల్సిన అవసరం ఉందన్నారు. కాగా మలేరియా వ్యాధితో ముందుగానే జాగ్రత్తపడితే పరిసరాలను శుభ్రం చేసి మలేరియా రాకుండా చూసుకోవచ్చని ఆయన వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి..

భూత్పూర్: మలేరియా బారిన పడకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉంచకుండా పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి రమణి అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఇళ్లలోని నిరుపయోగంగా ఉన్న టైర్లు, ఫ్రిడ్జ్, కూలర్‌లు, పాత సామాన్లలో ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉంచరాదని తెలిపారు. సీహెచ్ఓ అయ్యుబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగల వ్యతిరేకి.. కాంగ్రెస్ పార్టీ

భూత్పూర్: మాదిగల వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ అని, అరవై ఏళ్లు దేశాన్ని పాలించి ఓటు బ్యాంకుగా మాదిగలను వాడుకొని వదిలేశారని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ కో-ఆర్డినేటర్ బాల్‌రాజ్ ఆరోపించారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలో మూడు ఎంపీ సీట్లు మాలలకే కేటాయించారని, మాదిగలకు ఒక్క సీటు సైతం కెటాయించలేదని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ వైపు మాదిగలు ఉంటారని, డీకే అరుణను గెలిపిస్తామని చెప్పారు.

రాజ్యాంగ పీఠిక స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ప్రొ.భూమయ్య

మహబూబ్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగం మహోన్నతమైనదని, 60 దేశాల రాజ్యాంగాలను పరిశీలన చేసి రూపొందించినదని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ భూమయ్య అన్నారు. పూలే- అంబేద్కర్ జయంతుల సందర్భంగా రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాల్ అంశంపై సామాజిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్య రాజు అధ్యక్షతన సదస్సులో ప్రొ.భూమయ్య మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో భారత ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. లౌకికతత్వం ప్రజాస్వామ్యం, సామ్యవాదం లాంటి మహోన్నత లక్ష్య సాధనకు ఉద్దేశించబడినదని, ఇలాంటి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకునే, ఉద్యోగాలు పొందే, ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం వస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కుల, మత, ప్రాంతాలకు అతీతమైనదని, అన్ని మతాల వారికి స్వేచ్ఛ, సమానత్వం ప్రచారం చేసుకునే హక్కును కల్పించబడిందని అన్నారు. జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ 1947 నుంచి 2014 వరకు రాజ్యాంగానికి జరిగిన మార్పులు సమాజ అవసరానికి ఉపయోగపడ్డాయని అన్నారు. కానీ 2014 నుంచి 2024 వరకు రాజ్యాంగానికి జరిగిన మార్పులు చాలా ప్రమాదకరమైనవని అన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఉందని ఆనాడు కేసీఆర్ అన్నారని, కానీ ప్రజలు కేసీఆర్‌ను మార్చేశారని అన్నారు. కేంద్రంలోని ప్రభుత్వాన్ని కూడా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు అనేది మానవ వికాసానికి తోడ్పడాలి, అది హానీ చేయరాదని అన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానం, కానీ దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, ఉద్యమాలు చేస్తే, మాట్లాడితే దేశద్రోహులు అంటున్నారని అన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని హక్కులు మొత్తం ధ్వంసం చేస్తూ ప్రజల హక్కులను హరిస్తారని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేట్‌పరం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్లను లేకుండా చేస్తున్నారని అన్నారు. సదస్సులో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, ఆనంద్, పద్మ, ఖయ్యూం, లక్ష్మీదేవి, వెంకట్రాములు, బాలరాజు, ఆది విష్ణువర్ధన్, వేణు, బాలయ్య, నాగన్న, కృష్ణ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో ఎంపీ పూజలు



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గురువారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి ఆఖరి రోజు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం తన స్వగ్రామం గురుకుంటలోని సాయి దేవాలయం, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నామినేషన్ పత్రాలు దేవుడి పాదాల చెంత ఉంచారు. పూజలో కుటుంబ సభ్యులు, మండల ముఖ్య నాయకులు పాల్గొని ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రధాన అనుచరులు మొదటి సెట్ నామినేషన్ వేయగా, తాజాగా ఆయన స్వయంగా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



స్వీప్ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటుచేసిన మానవహారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి డా.శ్రీధర్‌సుమన్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై రెండో రోజు గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు మెప్మా సిబ్బంది, ఆర్పీలతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వేచ్ఛగా ఓటు వేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ బెంజిమన్, మెప్మా సీఓలు నిర్మల, వరలక్ష్మి, దేవమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, కళాజాతా ఓటు హక్కుపై నిర్వహించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

45 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: 45 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఆల్‌మేవా నాయకులు కోరారు. గురువారం ఆల్‌మేవా నాయకులు హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌తో సమావేశమై వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు 6 నుంచి 15 వరకు పెంచాలని, కేంద్రం కరువు భత్యం పెంచినప్పుడూ సత్వరమే రాష్ట్ర ప్రభుత్వం పెంచేటట్లు సిఫారులు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 65 ఏళ్లకు తగ్గించాలని, కముటేషన్ 12 ఏళ్లకు తగ్గించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ గృహ నిర్మాణం కోసం, వారి పిల్లల ఉన్నత విద్య కోసం స్వల్ప వడ్డీకి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఈహెచ్ఎస్‌ను రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసి సామాన్య ప్రజలవలే రూ.10లక్షల వరకు పరిమితి విధించి అన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో ఉచిత ఆరోగ్య సేవలు అందించాలని కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అదేవిధంగా రిటైర్డ్ అయిన ఉద్యోగికి 45 రోజుల్లో ఆర్థిక ప్రయోజనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ వహీద్‌షా, మహ్మద్ ఆరిఫ్, జావేద్ అహ్మద్, మహ్మద్ అయాబ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాజ్యాంగ పరిరక్షణ కోసం, సెక్యూలర్ విలువలను కాపాడుకునేందుకు ప్రజలందరూ యుద్ధప్రాతిపదికన ఉద్యమించాల్సిన అవసరం ఉందని సమూహ కార్యవర్గ సభ్యుడు ఉదయమిత్ర పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టీఎన్జీఓల భవనంలో వరంగల్ సమూహ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులా, రాజ్యాంగ విలువలు పూర్తిగా ధ్వసమైపోతున్నాయని, వీటిని ప్రజలుగా మనమే కాపాడుకోవాలని అన్నారు. రచయితలు, కళాకారులు ప్రజల్లో భాగంగా సాంస్కృతిక సైనికులుగా మారి ఇందుకు పూనుకోవాలని అన్నారు. ఉద్యమాల గడ్డ అయిన తెలంగాణ లోని కవులు, రచయితలు, కళాకారులు, మేధావులతో కలిసి 2023 ఆగస్టు 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమూహ అనే వేదికను ప్రారంభ సభ చేసి ఏర్పరచుకున్నారని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి తమ రంగాల్లో కృషి చేయాలని నాందీప్రస్తావనగా నిర్ణయించుకున్నారని అన్నారు. ప్రస్తుతం రెండవ మహాసభ వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 28న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. లౌకిక విలువలు, సాహిత్యంపై ప్రధానాంశంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ తాటికొండ రమేష్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రభాకర్, బోల యాదయ్య, శివశంకర్, జక్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



వేపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హన్వాద: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచిస్తు గురువారం కేంద్ర సాయుధ బలగాలు మండలంలో కవాతు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వేపూర్, గొండ్యాల్‌లో కవాతు కొనసాగింది. ప్రజలు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వెంకటేష్ ప్రజలకు సూచించారు.

1న కల్యాణ మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు జిల్లా బ్రాహ్మణ సేవా సమితి, పరశురామ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వచ్చేనెల 1న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహోత్సవంలో భాగంగా ఈనెల 30వ తేదీన వేదపఠనం, సహస్ర దీపాలంకరణ, ఎదుర్కొళ్లు, గాయకుడు గద్వాల చంద్రశేఖరరావుచే అన్నమాచార్య సంకీర్తన కచేరీ, చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లూరు భీమాచార్యులు, జోషి సంతోషాచార్యులు, గొండ్యాల రాఘవేంద్రశర్మ, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ సమీపంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున నందికోల సేవ, అగ్నిగుండం నిర్వహించారు. కార్యక్రమానికి చిన్నవడ్డేమాన్, అప్పంపల్లి, ఏదులాపూరం, పెద్దవడ్డేమాన్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అగ్ని గుండం తొక్కారు. దీంతో ఆలయ ప్రాంగణమంత శివనామస్మరణలతో మార్మోగింది.